క్లుప్తంగా

రామినాయుడుకు నంది అవార్డు



రామినాయుడును సత్కరిస్తున్న దృశ్యం

సంతకవిటి: మండలంలోని ఎస్.రంగారాయ పురానికి చెందిన ప్రముఖ రంగస్థల కళాకారుడు నిలురోతు రామినాయుడును తెలుగు వెలుగు సాహితీ వేదిక నంది అవార్డు వరించింది. స్వామి వివేకానంద జయంత్యుత్సవాలు–2025 సందర్భంగా విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం జరిగిన సన్మాన కార్యక్రమంలో ఆయనకు ఈ పురస్కారం అందజేశారు. పౌరాణిక నాటకాల్లో వీరబాహుడు, సత్యకీర్తి పాత్రల ద్వారా నాటక రంగ అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నందుకు గాను ఆయనకు ఈ అరుదైన సత్కారం లభించినట్లు సమాచారం.

త్వరితగతిన కేసులు పరిష్కరించాలి



ఆండ్ర పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎస్పీ భవ్యరెడ్డి

మెంటాడ: పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు సిబ్బంది కృషి చేయాలని బొబ్బిలి డీఎస్పీ భవ్యరెడ్డి సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మండలంలోని ఆండ్ర పోలీస్‌స్టేషన్‌ను సోమవారం ఆమె సందర్శించి, రికార్డులను పరిశీలించారు. ఓ మహిళపై పోలీసులు చేయి చేసుకున్న ఘటనకు సంబంధించి విచారణ జరుగుతోందని త్వరలోనే నివేదిక అందచేయడం జరుగుతుందని ఆమె చెప్పారు. అలాగే ఎన్నికల కోడ్‌ను ఎస్ఐ సీతారాం ఉల్లఘించినట్లు వచ్చిన ఆరోపణలపై కూడా సీఐ ఆధ్వర్యంలో విచారణ చేపడుతున్నామని, ఆ నివేదికను కూడా ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. అనంతరం సీఐ రమణతో కలిసి ఆండ్ర రిజర్వాయరును పరిశీలించారు.

పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్

రేగిడి: మండల కేంద్రానికి చెందిన ఆధ్యాత్మిక గురువు కిమిడి సత్యనారాయణనాయుడు ఇటీవల మృతి చెందగా, ఆయన కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ సోమవారం పరామర్శించారు. అనంతరం ఆయన మరణానికి గల కారణాలను అడిగి తెలుసుకుని, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ధైర్యంగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావులు, సర్పంచ్‌లు కెంబూరి వెంకటేశ్వరరావు, కరణం శ్రీనివాసరావు, సవలాపురపు రమేష్‌నాయుడు, పాలవలస దవళేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



నగదు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

సంతకవిటి: మండల కేంద్రంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ బొద్దాన ఈశ్వరరావు అకాల మరణం చెందారు. విషయం తెలుసుకున్న స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు(2000 టెన్త్ బ్యాచ్) బాధిత కుటుంబానికి ఎలాగైనా సాయం చేయాలని భావించారు. అందరూ చందాల రూపంలో పోగు చేసిన రూ.57 వేలను ఆర్థికసాయంగా సోమవారం అందజేశారు. కార్యక్రమంలో వీరంశెట్టి దుర్గారావు, పొట్నూరు సంతోష్, కాశిన రామకృష్ణ, జవ్వాది రమణ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించొద్దు



షాపు యజమానితో మాట్లాడుతున్న సీఐ అశోక్‌కుమార్

రాజాం సిటీ: రోడ్డుపక్క వ్యాపారాలు చేసేవారు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించవద్దని టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ హెచ్చరించారు. స్థానిక బజారుతో పాటు శ్రీనివాస థియేటర్ రోడ్డులో కాలువలపై వ్యాపారాలు చేస్తున్న వారితో సోమవారం మాట్లాడారు. రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు చేసినా, ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగించినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ముగిసిన ఉత్సవాలు

సంతకవిటి: మండలంలోని గోవిందపురంలో కొన్నిరోజులుగా జరుగుతున్న శ్రీసీతారామచంద్ర ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు సోమవారం ముగిశాయి. వేద పండితులు రేజేటి శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో గ్రామ పురోహితులు పులఖండం శ్రీనివాసశర్మ పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు చేశారు. వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్.. ఈ పూజల్లో పాల్గొని, రాముడికి ప్రత్యేక పూజలు చేశారు.

- చేతిరాతతో పరీక్షల్లో మంచి మార్కులు
- దగ్గరలోనే టెన్త్, ఇంటర్మీడియట్ ఎగ్జామ్స్
- మంచి దస్తూరీతో స్కోరింగ్‌పై దృష్టి
- పలు పాఠశాలల్లో అందమైన రాతకు శిక్షణలు



రాజాంలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు(ఫైల్)

అందమైన చేతిరాత.. భవిష్యత్‌కు బంగారు బాట!

రాజాం: పరీక్షల్లో మంచి మార్కులు సాధించేందుకు చక్కని చేతిరాత(దస్తూరీ) కీలకమైంది. జవాబు పత్రం మూల్యాంకనం చేసే వారి మనసును హత్తుకునేలా అందంగా రాత ఉండి, అడిగిన ప్రశ్నకు సరైన సమాధానం రాస్తే ఫుల్ మార్కులు సాధించవచ్చు. ప్రస్తుతం పదో తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు దగ్గర పడుతుండడంతో విద్యార్థుల ధ్యాసంతా చదువుపైనే ఉంది. ఇదే సమయంలో చదువుతో పాటు అందమైన చేతిరాతపై కూడా దృష్టి సారించాలని విద్యావేత్తలు సూచిస్తున్నారు. పరీక్షలప్పుడు విద్యార్థులు సహజంగా ఒత్తిడికి లోనవుతారు. పరీక్ష రాసేటప్పుడు మొదట మెల్లగా అందంగా రాస్తారు. క్రమక్రమంగా సమయం అయిపోతోందనే తొందరలో చేతిరాతలో వేగం పెంచుతారు. అప్పుడు ముందు రాసినది బాగా ఉండి, చివరలో రాసినది అంత బాగా ఉండదు. అలా కాకుండా పరీక్ష రాసే మొదటి నుంచి చివరి వరకు ఒకటే చేతిరాత ముచ్చటగా ఉంటే మనం ఆశించిన మార్కులు వస్తాయి. ఈ నేపథ్యంలో చేతిరాతను విద్యార్థులు నిర్లక్ష్యం చేయకూడదని ఉపాధ్యాయులు సలహా ఇస్తున్నారు. మంచి చేతిరాత ద్వారా పొందిన మార్కులే రేపోమాపో ఉన్నత చదువుల సీట్లు, ఉద్యోగాలు పొందేందుకు వెయిటేజీ మార్కులుగా ఉపయోగపడతాయని, భవిష్యత్ బంగారుమయం అవుతుందని చెబుతున్నారు.

మార్చి 1 నుంచి పరీక్షలు..

ఈ ఏడాది మార్చి 1వ తేదీ నుంచి ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ఆరంభం కానున్నాయి. జిల్లా వ్యాప్తంగా 20,902 మంది ఇంటర్మీడియట్ ఫస్టియర్, 20,368 మంది ఇంటర్మీడియట్ సెకండియర్ విద్యార్థులు ఈ పరీక్షలు రాయనున్నారు. అలాగే మార్చి 17వ తేదీ నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. మొత్తం 22,988 మంది విద్యార్థులు జిల్లాలో టెన్త్ పరీక్షలు రాయనున్నారు.

ఇలా రాయాలి..

- జవాబు పత్రం పైభాగంలో అంగులం స్థలం వదలాలి. ఎడమ వైపు అదే స్థాయిలో మార్జిన్ విడిచిపెట్టాలి. కుడివైపు అర అంగులం ఖాళీ వదిలి రాయాలి.
- తెల్లకాగితంపై సమాధానాలు రాయడం సాధన చేయాలి.
- పరీక్షలకు కొత్త పెన్నులు తీసుకువెళ్లకపోవడమే మంచిది. ఎందుకంటే అది బాగా రాయొచ్చు.. రాయకపోవచ్చు.
- గణితానికి సంబంధించి, అంకెలు, సంఖ్యలు సక్రమంగా రాయాలి.
- వ్యాకరణ దోషాలు లేకుండా జాగ్రత్త పడాలి.
- జవాబు రాయడం మొదలెట్టిన దగ్గర చివరివరకు సమాంతరంగా రాయాలి. పైకో లైను.. కిందికో లైను వెళ్లకుండా చూసుకోవాలి.
- పదానికి పదానికి, వాక్యానికి వాక్యానికి మధ్య తగిన నిడివి పాటించాలి.
- పెన్నును గట్టిగా బిగబట్టి రాయొద్దు. ప్రశాంతంగా పెన్ను తేలిగ్గా పట్టుకుని రాయాలి.

కొట్టివేతలు ఉండరాదు..



పరీక్షలు రాసేటప్పుడు జవాబు పత్రంలో కొట్టివేతలు లేకుండా చూసుకోవాలి. చక్కని దస్తూరీతో అన్ని జవాబులు రాసేందుకు ప్రయత్నించాలి. అక్షరాలు దిద్దడం, కొట్టివేయడం వంటివి చేయొద్దు. మంచి చేతిరాతను మార్కులు వేసేందుకు పరిగణలోకి తీసుకుంటారు.

– ఎస్.హుస్సేన్, గణిత ఉపాధ్యాయుడు, రాజాం

ఎక్కువ మార్కులకు అవకాశం..



పదో తరగతి అయినా, ఇంటర్మీడియట్ అయినా డిగ్రీ అయినా ఏ పబ్లిక్ పరీక్షల్లో అయినా మంచి దస్తూరీతో జవాబులు రాస్తే స్కోరింగ్ చేయవచ్చు. నాకు అందమైన చేతిరాత ద్వారానే గతేడాది పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో 581 మార్కులు వచ్చాయి. నేను రేగిడి మండలం, ఏవీపురం జెడ్పీ స్కూల్‌లో చదివాను. అక్కడ నాకు చక్కని చేతిరాతకు శిక్షణ ఇచ్చారు.

– కడగల దీపిక, ఏవీపురం, రేగిడి మండలం

ధాన్యం గొడౌన్‌గా పాఠశాల



రాజాం మండలం, రామానుజులపేట పాఠశాల ధాన్యం గొడౌన్‌గా మారింది. గతంలో ఇక్కడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను నడిపేవారు. అయితే విద్యార్థులు తక్కువగా ఉన్నారనే కారణంతో ఆ పాఠశాలను ఎత్తేశారు. దీంతో ఆ పాఠశాల భవనాలను దళారులు ధాన్యం నిల్వ ఉంచుకునేందుకు వినియోగించుకుంటున్నారు. ఇదే గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనం లేదని, ఈ భవనాన్ని కేంద్రానికి అప్పగించాలని గ్రామస్తులు కోరుతున్నారు. – రాజాం

వేడుకగా సామూహిక అక్షరాభ్యాసం



వసంత పంచమి పురస్కరించుకుని, రాజాం బస్టాండ్ ఆవరణలోని సరస్వతీ దేవి ఆలయంలో వేడుకగా సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం సోమవారం జరిగింది. రాజాంతో పాటు పరిసరాల ప్రాంతాల నుంచి మొత్తం 320 మంది చిన్నారులను తల్లిదండ్రులు తీసుకువచ్చి, వారితో అక్షరాభ్యాసం చేయించారు. ఇదే రోజున పిల్లలతో అక్షరాభ్యాసం చేయిస్తే భవిష్యత్‌లో బాగా చదువుతారని ప్రగాఢ విశ్వాసం. కార్యక్రమంలో ఆలయ ఈవో పి.శ్యామలరావు, అర్చకులు రంపా రామచంద్రరావుశర్మ, రామాయణం శ్రీనివాసరావుశర్మ తదితరులు పాల్గొన్నారు. – రాజాం

పక్కాగా ఎన్నికల కోడ్ అమలు



పక్కాగా ఎన్నికల కోడ్ అమలు చేయాలని ఆర్‌డీవో జేవీవీఎస్ రామ్మోహనరావు సూచించారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో బొబ్బిలిలోని తన కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నేతలతో ఆయన సోమవారం సమావేశమై పలు సూచనలు చేశారు. ఎన్నికల సంఘం విడుదల చేసిన ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఎక్కడా ఉల్లంఘన జరగకుండా సహకరించాలని కోరారు. అనంతరం తహసీల్దారు కార్యాలయం వద్ద ఎన్నికల కోడ్ ప్రతులు ప్రదర్శించారు. – బొబ్బిలి/బొబ్బిలిరూరల్

పార్టీ బలోపేతానికి పాటుపడాలి



పార్టీ వివిధ విభాగాల అధ్యక్షులను అభినందిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్

రేగిడి: వైఎస్సార్ సీపీ మరింత బలోపేతానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులంతా కృషి చేయాలని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ సూచించారు. ఇటీవల పార్టీ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడిగా ఎన్నికైన కరణం శ్రీనివాసరావు, పార్టీ నియోజకవర్గ ఇంటలెక్చువల్ అధ్యక్షుడిగా ఎన్నికైన కెల్ల మన్మధరావు, పార్టీ నియోజకవర్గ మైనారిటీ సెల్ అధ్యక్షుడిగా ఎన్నికైన షేక్ సలీమ్, పార్టీ దివ్యాంగుల సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన కడగల గురివినాయుడులను పాలకొండలోని తన స్వగృహంలో ఎమ్మెల్సీ సోమవారం అభినందించారు. పార్టీలో కష్టపడిన వారికి ఎప్పుడూ తగిన గుర్తింపు ఉంటుందని, పార్టీ పదవులు పొందిన వారంతా పార్టీ అభివృద్ధికి పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, రేగిడి, వంగర మండలాల పార్టీ కన్వీనర్లు వావిలపల్లి జగన్మోహనరావు, కరణం సుదర్శనరావులు, లక్ష్మీపురం సర్పంచ్ కెంబూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రూ.300 వేతనం వచ్చేలా పనులు



ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచనలిస్తున్న ఏపీడీ రమామణి

బొబ్బిలిరూరల్: ఉపాధి హామీ పథకం పనుల్లో వేతనదారులకు రోజుకు రూ.300 వేతనం లభించేలా పనులు చేయించాలని ఏపీడీ కె.రమామణి సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లతో సోమవారం సమావేశమైన ఆమె.. ఎండ తక్కువ ఉన్నప్పుడు ఉదయం 7 గంటలకే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పనిలోకి వచ్చిన వారికే మస్తరు వేయాలని, పని ప్రదేశం వద్ద తాగు నీరు, టెంటు, ప్రథమ చికిత్స కిట్ అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో పి.రవికుమార్, ఏపీవో లక్ష్మీపతిరాజు తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: మండలంలోని కొమెర, మజ్జిరాముడుపేట, సోమరాజుపేట తదితర గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఏపీవో ఎస్.హరనాథ్ పరిశీలించి, పలు సూచనలు చేశారు. రెండు పూటలా నిర్దేశిత కొలతల ప్రకారం పనులు చేస్తే గిట్టుబాటు అయ్యే వేతనం లభిస్తుందన్నారు.

శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా పనిచేయాలి

బాడంగి: స్థానిక కేజీబీవీ(కస్తూరిబాగాంధీ బాలికా విద్యాలయం)ని సర్వశిక్షా అభియాన్ జిల్లా సహాయ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ ఎ.రామారావు సోమవారం సందర్శించారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు దగ్గరలోనే ఉన్నాయని, శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా పనిచేయాలని సిబ్బందికి ఆయన సూచించారు. విద్యార్థుల్లో తెలుగు, ఇంగ్లిష్ భాషల కమ్యూనికేషన్ స్కిల్స్ ఉండేలా చూసుకోవాలన్నారు.

జిల్లా యూనియన్ కార్యదర్శిగా రమణ

రేగిడి: ల్యాబ్ టెక్నీషియన్స్ జిల్లా యూనియన్ కార్యదర్శిగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ల్యాబ్ టెక్నీషియన్ బోనెల రమణ ఎన్నికయ్యారు. జిల్లా యూనియన్ ఎన్నికల్లో ఆయనను ల్యాబ్ టెక్నీషియన్లు(ఎల్‌టీ) ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎల్‌టీ ఉద్యోగాల క్రమబద్ధీకరణ సాధనకు యూనియన్ తరఫున పోరాటం చేస్తానని ఆయన అన్నారు.

ఎన్నికల నోటిఫికేషన్ ప్రదర్శన

బాడంగి: స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీఎన్నికల నోటిఫికేషన్ ప్రతిని తహసీల్దారు కె.సుధాకర్ సోమవారం ప్రదర్శించారు. మంగళవారం నుంచి ఈ నెల 10వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ, 11న నామినేషన్ల పరిశీలన, 13న నామినేషన్ల ఉపసంహరణ, 27న పోలింగ్ నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు తెలిపారు.

కొత్త కార్యవర్గం ఎన్నిక

రామభద్రపురం: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల పంచాయతీ కార్యదర్శుల కొత్త కార్యవర్గం ఎన్నిక సోమవారం జరిగింది. గౌరవాధ్యక్షుడిగా ఎ. శ్రీనివాసరావు, అధ్యక్షుడిగా పి.పార్థసారధి, ఉపాధ్యక్షులుగా పి.బంగార్రాజు, యు. శ్రావణ్, ప్రధాన కార్యదర్శిగా బి.శ్రీనివాసరావు, కోశాధికారిగా పి.సరస్వతి, సహాయ కార్యదర్శిగా పి.లక్ష్మణ్ ఎన్నికయ్యారు.

అగ్నిఅస్త్రం తయారీపై అవగాహన

వంగర: మండలంలోని మరువాడ గ్రామంలో అగ్నిఅస్త్రం కషాయం తయారీపై సోమవారం అవగాహన కల్పించారు. మొక్కజొన్న పంటపై ఈ కషాయం పిచికారీ చేస్తే ఆ పంటను ఆశించే కత్తెరపురుగును నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం మరువాడ యూనిట్ ఇన్‌చార్జి ఆర్నిపల్లి సింహాద్రినాయుడు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి

వంగర: మత్తు పదార్థాలకు యువత, విద్యార్థులు దూరంగా ఉండాలని ఎస్ఐ షేక్ శంకర్ సూచించారు. మండలంలోని మడ్డువలస ప్రభుత్వ జూనియర్ కళాశాల, వంగర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు అరసాడ గ్రామంలో సంకల్ప రథం ద్వారా మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలు, సైబర్ నేరాల బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

రామభద్రపురం: రానున్న వేసవికాలం దృష్ట్యా తాగునీటి ఎద్దడి నివారణకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో రత్నం సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యాదర్శులతో సోమవారం సమావేశమైన ఆమె.. గ్రామాల్లో తాగునీటి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులు చేయించాలన్నారు.

అభ్యసన సామర్థ్యాలు మెరుగుపరచాలి

తెర్లాం: విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మెరుగుపరచాలని ఎంఈవో జె.త్రినాధరావు సిబ్బందికి సూచించారు. మండలంలోని జగన్నాధవలస, చుక్కవలస గ్రామాల పాఠశాలలను ఆయన సోమవారం సందర్శించి, పలు సూచనలు చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, పాఠశాల రికార్డులు, మధ్యాహ్న భోజన పథకం, తాగునీటి సదుపాయం, మరుగుదొడ్లు పరిశీలించారు. చదువులో వెనకబడిన విద్యార్థి విద్యాప్రగతిపై దృష్టి సారించాలన్నారు.

పారిశుధ్య పనులు చేయాలి

రాజాం: మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుధ్య పనులు చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఎంపీడీవో వి.శ్రీనివాసరావు ఆదేశించారు. మండలంలోని గడిముడిదాం గ్రామంలో జరుగుతున్న పారిశుధ్య పనులను ఆయన సోమవారం పరిశీలించారు. కాలువలు, వీధుల్లో చెత్తాచెదారం వేయకుండా గ్రామస్తులకు అవగాహన కల్పించాలని తెలిపారు.

ఘనంగా వసంత పంచమి పూజలు



తెర్లాం: అంగన్‌వాడీ కేంద్రంలో సరస్వతీదేవికి పూజలు చేస్తున్న దృశ్యం



వంగర: మడ్డువలస కళాశాల వద్ద ఉన్న సరస్వతీదేవి విగ్రహం వద్ద పూజలు చేస్తున్న సిబ్బంది

బొబ్బిలి/తెర్లాం/వంగర మండలాల్లోని పలు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో వసంత పంచమి పూజలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది అంతా సరస్వతీదేవికి విశేష పూజలు చేసి, విద్యార్థులకు మంచి విద్యాబుద్ధిని ప్రసాదించాలని వేడుకున్నారు. కొన్నిచోట్ల సామూహిక అక్షరాభ్యాసాలు చేశారు.

– బొబ్బిలి/తెర్లాం/వంగర



బొబ్బిలి: సామూహిక అక్షరాభ్యాసాలు చేయిస్తున్న తల్లిదండ్రులు

గుంతలు లేని రోడ్లు కార్యక్రమం అట్టర్ ఫ్లాప్



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్

- వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్

రాజాం: సంక్రాంతి నాటికి గుంతలు లేని రోడ్లు లక్ష్యమని కూటమి ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమం అట్టర్ ఫ్లాప్ అయిందని వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ విమర్శించారు. ఇదే విషయమై ఆయన రాజాం పట్టణంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల రోడ్లతో పాటు రాజాం ప్రధాన రహదారి బాగు చేసేందుకు మొత్తం రూ.6 కోట్ల నిధులు విడుదలయ్యాయని, ఆయా నిధులతో పూర్తిస్థాయిలో పనులు చేయించడంలో అటు అధికారులు, ఇటు కూటమి నాయకులు విఫలమయ్యారన్నారు. రోడ్లలో అక్కడక్కడి గోతులు పూడ్చి పూర్తి పనులు చేసినట్లు అధికార పార్టీ నేతలు ప్రచారం చేసుకుంటున్నారని ధ్వజమెత్తారు. ఇప్పటికీ రాజాంలో సంపత్ భవన్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు రోడ్డు గోతులమయమేనన్నారు. సంతకవిటి–సిరిపురం గ్రామాల మధ్య రోడ్డులో కనీసం గ్రావెల్ కూడా వేయలేదని మండిపడ్డారు. గుళ్లసీతారాంపురం–ఖండ్యాం గ్రామాల మధ్య రోడ్లు అయితే పొలాల గట్లను తలపిస్తున్నాయన్నారు. గాయత్రి కాలనీ నుంచి పెనుబాక, బొద్దాం గ్రామాల వరకు ఉన్న రోడ్డులో కనీసం రాతిబుగ్గి కూడా వేయలేదని, రోడ్ల మరమ్మతులకు కేటాయించిన కోట్లాది రూపాయలు ఏమైనట్లు ప్రశ్నించారు. చేసిన పని తక్కువ.. ప్రచారం ఎక్కువ అని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా ప్రచారార్భాటాలు మాని, ప్రజలకు మంచి జరిగే పనులు చేయాలని హితవు పలికారు. కార్యక్రమంలో పార్టీ రాజాం పట్టణ, రూరల్ అధ్యక్షులు పాలవలస శ్రీనివాసరావు, లావేటి రాజగోపాలనాయుడులు, బూత్ కమిటీల నియోజకవర్గ అధ్యక్షుడు రాగోలు రమేష్‌నాయుడు, అంతకాపల్లి సర్పంచ్ వాకముల్ల చిన్నంనాయుడు, వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్, రాజాం ఐటీ వింగ్ అధ్యక్షుడు పాలవలస గోపి, డాక్టర్ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు అధ్వానం.. ప్రయాణం నరకం!



సంతకవిటి: మట్టిరోడ్డును తలపిస్తున్న సంతకవిటి-కొండగూడేం తారురోడ్డు



సంతకవిటి: అధ్వానంగా గోవిందపురం రోడ్డు



సంతకవిటి: గోతులమయంగా జావాం రహదారి

రోడ్లు అధ్వానంగా ఉండడంతో ప్రయాణం చేసేటప్పుడు జనం నరకయాతన అనుభవిస్తున్నారు. గ్రామీణ రోడ్లు అయితే మరీ దారుణంగా ఉన్నాయి. ఎక్కడికక్కడ రోడ్డు ధ్వంసం కావడంతో గోతులమయమైన రోడ్డు మీదుగా పయనించాలంటే వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. వాహనాలు పాడవ్వడంతో పాటు గుంతల్లో ప్రయాణిస్తుంటే ఒళ్లు హూనమైపోతోందని వాపోతున్నారు. సంక్రాంతి నాటికి గుంతలు లేని రోడ్లు వేసి చూపిస్తామని ప్రభుత్వం చెప్పిందని, ఎక్కడ ఏదీ అని కూటమి నేతలను ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

– సంతకవిటి